ఈవారం కథ ★



# నీట మునిగిన నిజాలు

— భమిడిపాటి వెంకటరమణ

సుందర్‌పూర్ చేరేటప్పటికి పగలు తొమ్మిది గంటలయింది. అప్పటికింకా ఆ వూర్లో సూర్యరశ్మి ప్రవేశించలేదు. మంచు ఇంకా కురుస్తోంది. రాత్రంతా కురిసిన మంచుతో చెట్లు తెల్లటి ముసుగేసుకున్నట్టున్నాయి.

సుందర్‌పూర్ ఒకప్పుడు జమిందారీ. అది దాసీల స్థావరం. ఉద్యోగస్తులందరూ బయట నుండి వచ్చినవారే. సుందర్‌పూర్‌లో వుండేది వీరే. చుట్టుపక్కల గ్రామాలయిన పల్లెల్లో ఆదివాసులే నివసిస్తున్నారు.

తెల్లవారేసరికి కావిళ్ళతో బుజాన, బుర్రలమీద బుట్టలతో బియ్యం, అపరాలూ, కూరలూ, తెల్లమట్టి ఎర్రమట్టి ఆకులూ, పలు దుంప కూరలూ, అడవుల్లో కాచిన పళ్ళూ తెచ్చి బజార్లో అమ్ముతారు. జమిందారీలు రద్దయాక గవర్నమెంటు ఆఫీసులు స్థాపించారు ఇక్కడ.

నాకోసం గేటు దగ్గర ఆఫీసు ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. మా కారు వచ్చి ఆగగానే ఎదురుగా వచ్చి నమస్కారాలు చేసారు. నాకోసం నిర్ణయించిన బస చూపించారు. నా పెట్టే, బెడ్డింగూ గౌరవనీయుడుగా కనిపించే ఒక యాభై ఏళ్ళ వృద్ధుడు అతి వినయంగా తీసుకొని బసకు దారి తీసాడు. అతడి పేరు నారాయణ. అప్పటికప్పుడే స్నానానికి వేడి నీళ్ళు సిద్ధం చేసి వున్నాయి. వెంటవెంటనే ఫలహారాలూ కాఫీ ఏర్పాటు అయాయి. మరో గంటలో నేను ఆఫీసులో ప్రవేశించాను. ఆఫీసు ఒక జమిందారీ భవనంలోనే. మధ్యాహ్నం భోజనాలయాక మళ్ళీ ఆఫీసు పనిలో నిమగ్నమయాను. సాయంకాలం ఐదింటికే చీకటితోపాటు చలి ప్రవేశించింది. మంచు కురవడం ఆరంభించింది. విపరీతంగా కురుస్తోంది. రాత్రి భోజనాలయాక నిద్ర పోదామనుకుంటే చలి భరించరానిదిగా వుంది. నేను తెచ్చుకున్న కంబళీ, రగ్గులూ ఆ చలికి ఆగలేదు. "ఇంతకన్న వెచ్చనయిన చోటు లేదా?" అని అడిగాను నారాయణ్ణి. "లేకేం బాబూ, మన ఆఫీసు వుంది కదా! జమిందారు భవనం. అందులో రాణీ సాహెబాగారు వుండేవారట తమ సంసారంతో. దిగువ భాగంలో మగవారు కూర్చుంటే మేడమీద స్త్రీలు వుండేవారు. చలి ఇక్కడ ఎక్కువే. చలి కాచుకునేందుకు ఇంగ్లీషువారి ఇళ్ళలో లాగ ఇక్కడా ఫైర్ సైడ్ వుంది. ఇదివరకు ఇంకా ఎక్కువ చలిగా వుండేది. అడవులు కొట్టేశాక కొంత తగ్గింది. ఇన్ని సదుపాయాలు వుండికూడ మహారాజులు వెచ్చదనం కోసం పట్నంలో వున్న వాళ్ళ బంగళాలకి వెళ్ళిపోయేవారు. ఏ సదుపాయాలు లేని ఈ ఆదివాసీలు ఈ చలికి ఎలాగ కాచుకొని బ్రతికొస్తున్నారో మరి ఆశ్చర్యం. మీకు అభ్యంతరం లేకపోతే ఆఫీసు టేబుల్ మీద పడుకోవచ్చు. మీ బెడ్డింగ్ అక్కడికి చేర్పిస్తాను. ఉదయం స్నానం అక్కడే చేయవచ్చు. ఫలహారాలు, కాఫీ అక్కడికే తెస్తాను. పది గంటలకి కదా ఆఫీసర్లూ, గుమాస్తాలూ వచ్చేది" అన్నాడు. గత రాత్రంతా నిద్ర లేదు. ఈ రాత్రయినా నిద్ర పోకపోతే మర్నాడు పని పాడవుతుంది. నారాయణ చెప్పినట్టు ఆఫీసులో చలి బాధ లేదు. నాకోసం రెండు టేబిళ్ళు జతచేసి పక్క అమర్చాడు. అతణ్ణి చూసాక అతనితో మాట్లడాలనిపించింది. అక్కడ కుర్చీమీద కూర్చోమన్నాను.

"నువ్వు చూడగా మర్యాదస్తుడల్లే వున్నావు. ఈ వాచ్‌మేన్ ఉద్యోగానికి ఇక్కడికి ఎలా వచ్చావు?" అని అడిగాను.

"మీరు సరిగ్గానే గ్రహించారు బాబూ. మాది మర్యాదస్తుల కుటుంబమే. రత్నపురంలో మాకు పదీపదిహేను ఎకరాల మాగాణీ వుండేది. ఇల్లు వుండేది. మేము వ్యవసాయం చేసుకొని బ్రతికేవాళ్ళం. దేనికీ లోటుండేది కాదు."

"అయితే ఇప్పుడేమొచ్చింది? మీ భూమి, ఇల్లూ ఏమయాయి?" అని అడిగాను.

"ఏం చెప్పమన్నారు బాబూ! నీట మునిగిన మా భూముల కథా, మా బ్రతుకుల కథా మీరు వినలేదా ఇదివరకు? మీరు వచ్చిన దారిలో చూసే వుంటారు. శ్యాంపురం బిజిలీ కేంద్రం. అక్కడ్నుంచీ ఏభై అరవై కిలో మీటర్ల వరకు పారే కాలువలూ, చుట్టుప్రక్కల పంట పొలాలకి నీళ్ళు అందిస్తున్న ఆ నీటి క్రింద మునిగాయి అరవై ఆరు గ్రామాలు. అందులో మా గ్రామం ఒకటి" అన్నాడు.

"అట్లయితే మీకు గవర్నమెంటు నష్టపరిహారం చెల్లించవలసి వుంటుంది. మీకు మళ్ళీ పునరావాసం ఏర్పరచవలసి వుంటుంది. ఇప్పటికప్పుడే పాతిక ముప్ఫై ఏళ్ళు పైబడింది కదా, ఇంతవరకూ మీకే సదుపాయం చెయ్యలేదా ఈ ప్రభుత్వం?" అని అడిగాను.

"అదే బాబూ మా దురదృష్టం. మా గ్రామానికి రికార్డ్ ఆఫ్ రైట్స్ లేదు. నీట మునిగాక ఇప్పుడు తయారు చేస్తున్నారు. జమిందారీ రికార్డు సరిగా లేదు. సహాయ పడలేదు. మా భూములు ఎక్కడున్నాయో, ఎంతెంతో, ఎంతెంత పంటలు పండేవో తెలిపే వివరాలు లేవు."

"మీ భూములు ఎక్కడున్నాయో మీరు చూపలేరా? వివరాలు మీరు చెప్పలేరా?"

"చెప్పలేకేంబాబూ! చూపించగలం. ఇప్పుడు ఈ

దేశంలో వ్యవసాయాభివృద్ధికి నీటి పారుదల కల్పించుకోకతప్పదు. ఆ బృహత్ ప్రయత్నంలో భూమిని నమ్ముకున్న రైతుల జీవితాలు నీట మునిగిపోతాయి. పరిహారంగా అందే డబ్బుతో ఆ జీవితాలు బాగు పడవు. అభివృద్ధి కోరుకోవలసిందే. అయితే, ఆ అభివృద్ధి ఎవరికి జరిగిందన్నదే ప్రశ్న.

6-7-90 ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక

నీటిలో మునిగాక కూడా పడవమీద వెళ్ళి నీళ్ళ క్రింద కర్రతో పొడిచి మా భూములు ఎక్కడున్నాయో చూడగలం. మా పొలాలు ఎంత సారవంతమయినవో, ఏ కాలంలో ఏం పండించేవాళ్ళమో కూడ చెప్పగలం. కానీ, మా మాట వినేదెవరు? మా బాధను అర్చే దెవరు? తీర్చేదెవరు? పెద్ద పెద్ద బాబులంతా చదువుకున్న వాళ్ళూ, వకాల్తా చేసే వాళ్ళూ, తమ భూములు వున్నదానికన్నా అధికంగా రాయించుకుని మెట్ట పరకల్ని కూడా ఫస్టు క్లాసు భూములుగా మార్పించుకుని తహసిల్ దార్, రెవిన్యూ ఇన్ స్పెక్టర్లకి లంచాలిచ్చి లక్షల కొద్దీ నష్ట పరిహారాలు సంపాదించారు. పట్నాల కెళ్ళి ఇళ్ళు కట్టుకుని, పిల్లలకి పెద్ద చదువులు చెప్పించి బాగా సంపాదించుకుంటూ సుఖంగా వున్నారు. మా బ్రతుకులే ఇలా గంగపాలైపోయాయి. మాకూ ఏదో ఇల్లు కట్టుకోవడానికి జాగాలిస్తామనీ, నష్ట పరిహారంతో ఇల్లు కట్టుకోవచ్చునని ఏదైనా వ్యవసాయమో, వ్యాపారమో చేసుకోవచ్చుననీ ఎన్నో కబుర్లు చెప్పారు. ఇంతవరకూ అటువంటిదేమీ లేదు. మేమూ పిల్లలం బ్రతకడం ఎలాగు? మా పిల్లల చదువులెలా సాగుతాయి? ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు ఎలా జరుగుతాయి? పెళ్ళి ఈడు ఆడపిల్లల్ని ఇంట్లో పెట్టుకుంటే మాలో ఆంక్ష పెడ్తారు. అందుకని ఈ వాచ్ మన్ ఉద్యోగానికి సిద్ధపడవలసి వచ్చింది. రాంపురంలో ఖాళీ లేదంటే ఈ సుందర్ పూర్ లో ఉద్యోగానికి వచ్చుకొని వచ్చాను" అన్నాడు. అతని దురవస్థ వింటే నాకు చాలా జాలి వేసింది.

"మరి అక్కడున్న ఆదివాసుల గతి ఇంక ఎలాగుంటుందో" అని అడిగాను.

"వాళ్ళ సంగతి ఇంక చెప్పడాని కేమి మిగిలి వుంది బాబూ? గుండె రగిలిపోతోంది. ఈ అభివృద్ధి ప్రణాళికలూ ఈ బిజిలీ ఏర్పాట్లూ ఈ నీటి సదుపాయాలూ అన్నీ నాగరికుల కోసం వచ్చినవేకాని ఈ పేదల బాధ తీర్చడానికి మాత్రం కాదు. బాధలకి అలవాటు పడ్డ వాళ్ళు బాధలు పడుతూ వుండడమే లోక నీతిలా అనిపిస్తోంది. అయినా వాళ్ళు ఈ నష్ట పరిహారం క్రింద ఇచ్చే డబ్బుతో ఏం చేసుకుంటారని? మా వూళ్ళోనే వుండే ఒక ఆదివాసీ కుటుంబ గాధ మీకు చెప్తాను వినండి. వాళ్ళు నలుగురు అన్నదమ్ములు. నలభై, యాభై ఎకరాల భూమి సాగు చేసుకునే వారు. తాతల కాలం నుంచి వాళ్ళకదే వృత్తి– వ్యవసాయం. నలుగురు అన్నదమ్ములు సోమరిపోతులయారు. తప్పతాగి ఒళ్ళు మరిచి చెట్ల క్రింద దొర్లే వాళ్ళు. పని చేసేవారు కాదు. ఆడవాళ్ళే నడుంకట్టి పొలం పనులు చేసేవాళ్ళు. వాళ్ళకి కావలసిన తిండి గింజలు ఇంటికి చేర్చే వాళ్ళు. కర్ర పుల్లలకి, కాయ గూరలకి వెతుక్కోనక్కర్లేకుండా వారి పొలాల నుండి తెచ్చుకునేవారు. మట్టి గోడలు, పూరి గుడిశల్లోనే గడుపుకునేవారు. డబ్బంటే ఏమిటో వాళ్ళకి తెలీదు. తెలిసిందల్లా ఒక ఇరవై కాకపోతే రెండు ఇరవైలు. అవయినా రూపాయిల కాసులయితేనే లెక్క తెలుస్తుంది. కాగితాలు వాళ్ళు గుర్తు పట్టలేరు. పదికీ వందకీ తేడా తెలీదు. వారం వారం సంతలకిపోయి వాళ్ళకి కావలసిన తాడూ, పలుగూ, పశువులకి మేత, విత్తనాలూ ఎరువులూ ఇతర సనిముట్లూ ఇంటికి కావలసిన ఉప్పూ, కిరసనాయిలూ, బట్టా, పారా తెచ్చుకునేవారు. ఒక ఇరవై, లేక రెండు ఇరవైలు అప్పుచేస్తే రెండు లేక నాలుగు సంతల్లో తీర్చుకునేవారు. వాళ్ళ పొలాలూ ఇళ్ళూ నీటిలో మునిగాక తలదాచుకోడానికి చోటు లేక, తినడానికి గింజలు లేక ఊరూర తిరిగారు. వేరే పనిపాటా చేతకాని వాళ్ళు తిండికి లేక అల్లల్లాడిపోయారు. పెద్ద వాళ్ళంతా ఆకలికీ, రోగాలకీ ఆహుతి అయారు. ఆ కుటుంబం అంతటికీ మిగిలింది ఒక్కడే 'సోనియా' గాడు. వాణ్ణి మేమందరం సన్యాసీ అని పిల్చేవాళ్ళం. వాడికి లోక జ్ఞానం అసలే లేదు. ఇన్నాళ్ళకి వాళ్ళకి నష్ట పరిహారం



నిర్ణయమయింది. లక్షకి పైచిలుకు ప్రస్తుతం ఇస్తామని ప్రభుత్వం తెలియచేసింది. ఈ సంగతి వూళ్ళో వాళ్ళకి తెలిసింది. వాళ్ళూ 'సోనియా' గాడికోసం వెతికారు. ఎక్కడో ఎవరిదగ్గరో పొలం పనులు చేసుకుని బ్రతుకు తున్న వాణ్ణి పట్టుకున్నారు. సంగతి చెప్పారు. "యాభై వేలా? అది ఎంత? రెండు ఇరవైలు వుంటుందా?" అని అడిగాడు వాడు. రెండు ఇరవైలు ఏం ఖర్మం. రెండు వేల ఇరవైలు. రెండు చేతులూ చాలవు అవి అందుకోవడానికి. నీ గోని సంచిలో మూట కట్టు కునే అంత డబ్బు అన్నారు. అది ఎంత డబ్బో వాడికి అర్థం కాలేదు.

ఎస్.డి.ఓ. గారు రమ్మన్నారు వాళ్ళ కచ్చేరికి. వస్తే డబ్బు ఇస్తారు. నువ్వు అడిగినంతా ఇస్తారు. అంత డబ్బూ కావాలన్న ఇచ్చేస్తారు. లేదా సగమయినా అడిగి తీసుకోవచ్చు. ఒకమారు, మరోప్పుడు మరికొంత తీసుకోవచ్చు. నిన్ను మేమంతా తీసుకెళ్ళి ఎస్.డి.ఓ. గారికి తెలియజేస్తాం. నీకు దొరికిన దాంట్లో కొంత మాకు పారేయ్ అంతా నీకు అక్కర్లేకపోతే" అన్నారు. సోనియాకి వెళ్ళక తప్పింది కాదు.

ఎస్.డి.ఓ. గారు అడిగారు "నీకెంత కావాలి" అని. "రెండు ఇరవైలు ఇప్పించండి" అన్నాడు సోనియా. ఎస్.డి.ఓ., ఇతర ఉద్యోగులూ నవ్వుకున్నారు. అంతకన్న అధికం అడగమన్నారు. సగం అడిగినా ఇస్తామన్నారు. ఆ సగం ఎంతో తెలీదు సోనియాకి. మరి అడగలేదు. బయటకు వచ్చేసాడు. శ్రేయోభిలాషులు అడిగారు 'ఏమయిందని.' "మీరు బలేవాళ్ళే! నన్ను కోతిని చేసి ఆడిస్తున్నారు. బుద్ధిలేనివాణ్ణి అని అంత ఇస్తారు, ఇంత ఇస్తారు అని చెప్పారే! ఆ ఎస్.డి.ఓ. గారు రెండు ఇరవైలు అడుగుతే ఇచ్చారు కాదు" అన్నాడు. అందరూ నవ్వులు దాచుకున్నారు. వాడికి నచ్చ చెప్పారు. ఈసారి పోయి పాతిక వేలు అడగమన్నారు. "దాంతో ఏం చేసుకోవాలి" అని అడిగాడు సోనియా. "ఇల్లు కట్టుకోవచ్చు, ఎడ్లు కొనుక్కోవచ్చు, బండి చేయించవచ్చు, విత్తనాలు కొనవచ్చు. ఎరువులు కొనవచ్చు, పని వాళ్ళను పెట్టుకోవచ్చు.."

"అన్నీ బాగున్నాయికాని అసలు నాకు భూమే లేదు. నాకు తిండిపెట్టే తల్లే లేకపోయాక ఇవన్నీ తెచ్చుకుని ఏంచేయడం? ఎక్కడో ఎవరి దగ్గరో వ్యవసాయ కూలీగా వుండి నా తిండి సంపాదించుకుంటాలెండి. ఆ డబ్బేదో వాళ్ళనే వుంచుకోమనండి. లేకపోతే ఇంకెవరికయినా పంచిపెట్టమనండి." అని అక్కణ్ణుంచి చరచరా నడిచెళ్ళిపోయాడు. శ్రేయోభిలాషులు ఎంత పిలిచినా ఆగలేదు. వెనక్కు తిరిగి చూడ లేదు. అందరూ తెల్లబోయారు.

ఆ కథ వినేసరికి నాకు కళ్ళ నీళ్ళు తిరిగాయి.

"బాబూ, చాలా రాత్రి అయింది. మీరింక నిద్ర పొండి. పొద్దుటే వచ్చి నిద్ర లేపుతాను." అని లైట్లు ఆర్పి తలుపులు వేసుకొని బయటకి పోయాడు నారాయణ.

నాకు నిద్ర మగత వచ్చింది. అందులో నేను నీటిలోకి దిగి ఇంకా మునిగిపోయిన నిజాలకోసం వెతుకుతున్నాను ●